ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబర్ 2024
5
అనంతపురం

జిల్లాలో పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్‌మీట్ ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ సబ్ డివిజన్, ఎఆర్ విభాగం పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 110 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం ఎఆర్ పోలీసు జట్టు 12.5 ఓవర్లలో 114 పరుగులు చేసి గెలుపొందింది. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాముడు, ఎస్ఐ రుష్యేంద్రబాబు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో వక్తలు

పూటుగా మద్యం

'ఎంఆర్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా రూ.5 లక్షలు జరిమానా. బెల్టు షాపులు నిర్వహిస్తూ రెండోసారి పట్టుబడితే లిక్కర్ షాపు లైసెన్స్ రద్దు చేస్తాం' ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తున్న మాట. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. మద్యం షాపుల వద్ద అనధికార రూమ్‌లు, గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. నిబంధనలను పక్కన బెట్టి మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం అమ్మకాలు పెరగడంతో పూటుగా తాగిన మందుబాబులు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లో మద్యం బాబుల చేష్టలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ ప్రేక్షఖ పాత్రకే పరిమితం అవుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- ◆ అనధికార పర్మిట్ రూములు
- ◆ గ్రామాల్లో బెల్టు షాపులు
- ◆ రోడ్లపై మందుబాబుల హల్‌చల్
- ◆ పోలీసులనూ లెక్కచేయని వైనం
- ◆ ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపులను ప్రభుత్వమే నడిపేది. ధర ఎక్కువ కావడంతో పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి దొంగచాటుగా అమ్మేవారు. దీన్ని కట్టడి చేయడానికి గత ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన వెంటనే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నూతన మద్యం పాలసీని రద్దు చేసి పాత పద్ధతిలో టెండర్లను పిలిచి మద్యం షాపులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించింది. ఇందులో భాగంగా సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించింది. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మకుండా చూడటం, ఎక్కడా బెల్టు షాపులు నిర్వహించకుండా చూడటం, మద్యం షాపుల యజమానులు నిబంధనలు ఉల్లంఘించకుండా చూడటం ఎక్సైజ్ అధికారుల విధి. అయితే ఎక్సైజ్ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతి షాప్‌కు అనధికారిక పర్మిట్ రూమ్

జిల్లా వ్యాప్తంగా 136 మద్యం షాపులు ఉండగా అనంతపురం నగరంలోనే 41 షాపులు ఉన్నాయి. నిబంధనల మేరకు మద్యం షాపుల వద్ద తాగడానికి లేదు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఒక్కో షాపు నుంచి రూ.2 లక్షలు కట్టించుకుని తాగడానికి పర్మిట్ రూములకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ఇంకా అటువంటి అనుమతులు ఏవీ రాలేదు. ఒకటి రెండు షాపులు మినహా మిగిలిన అన్ని షాపుల వద్ద బహిరంగంగా అనధికారిక పర్మిట్ రూములు నిర్వహిస్తున్నారు. దీన్ని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇందుకు కారణం కొంత మేరకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు కాగా మిగిలిన షాపుల నుంచి మామూళ్లు ముట్టడమేనన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గ్రామగ్రామాన బెల్టు షాపులు ఏర్పాటు చేసి బహిరంగంగానే మద్యం అమ్మకాలు చేస్తున్నారని సమాచారం. అది కూడా గతంలో ఎవరు అమ్మినా వారిని పట్టుకుని కేసులు నమోదు చేసే ఎక్సైజ్ అధికారులు ప్రస్తుతం అధికార పార్టీ కార్యకర్తలు బెల్టు షాపులు నిర్వహిస్తూ ఉండటంతో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

రోడ్లపై మందుబాబుల హల్ చల్

అనధికారిక పర్మిట్ రూముల్లో మందు తాగి ఇక తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో మందుబాబులు రోడ్లపైకి వచ్చి హల్ చల్ చేస్తున్నారు. పట్టపగలే రోడ్లపై గొడవలకు దిగుతున్నారు. వారించడానికి వచ్చిన పోలీసులను సైతం ఎదిరిస్తూండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఓ షాపులో పూటుగా మద్యం సేవించిన ఓ మందుబాబు అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అద్దాలు పగులకొట్టాడు. వెంటనే డ్రైవర్, కండెక్టర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనను పట్టుకున్నారు కానీ ఆర్టీసీ వారిని ఎందుకు పట్టుకోవడం లేదంటూ పోలీసులపై మద్యం తాగిన వ్యక్తి విరుచుకుపడ్డాడు. ఇది జరిగిన మరుసటి రోజు రాత్రి బళ్లారి బైపాస్ లోని అనధికారిక పర్మిట్ రూములో మద్యం సేవించిన మందుబాబులు దివాకర్ పాన్ సెంటర్ వద్ద నడిరోడ్డుపై హల్ చల్ చేశారు. దీంతో 4వ పట్టణ సిఐ సంఘటనా స్థలానికి చేరుకుని గొడవను కట్టడి చేయాల్సి వచ్చింది. ఇలా తరచూ ఏదో ఒక చోట మద్యం బాబుల వికృత చేష్టలు కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుని మద్యం షాపులు వద్ద అనాధికారంగా తాగడాన్ని నియంత్రించి, అమ్మకాలపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

బళ్ళారి బైపాస్‌లో దివాకర్ పాన్ సెంటర్ వద్ద మందుబాబుల గురించి విచారిస్తున్న 4వ పట్టణ సిఐ సాయినాథ్(ఫైల్‌ఫొటో)

నత్తనడకన భూసేకరణ

◆ అవసరం 9500 .. సేకరణ 4808 ఎకరాలు..! ◆ హంద్రీనీవా విస్తరణ ముందుకు కదిలేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా రెండో దశ లైనింగ్‌కు రూ.930 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టుపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. మొదటి దశ వెడల్పు పరిస్థితి ఏమిటన్న డిమాండ్ విపక్షాల నుంచి ఎదురవుతోంది. ఈ వెడల్పును 3850 క్యూసెక్కులకు పెంచుతామని ప్రభుత్వం చెబుతోంది. ఇది చేయాలంటే ఇప్పటికీ భూసేకరణ పనులు నత్తనడకనే నడుస్తున్నాయి. దశబ్దకాలంగా సేకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఒకవైపు ప్రాజెక్టుల శంకుస్థాపనలు మాత్రం జరిగిపోవడమే కాకుండా కొంత వరకు పనులను కూడా చేపట్టారు. నిర్వాసితుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

హంద్రీనీవా మొదటి దశలో కావాల్సింది 9500 ఎకరాలు

హంద్రీనీవా మొదటి దశలో జరుగుతున్న పనులకు సంబంధించి మొత్తం 9500 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇందులో 8332 ఎకరాలకు సంబంధించి భూసేకరణకు అవసరమైన ప్రక్రియను అధికార యంత్రంగం చేసింది. ఇందులో సేకరించింది మాత్రం ఇప్పటి వరకు 4808 ఎకరాలు మాత్రమే. అనుమతిపొంది వారకు చూసుకున్నా ఇంకా 3524 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని 2018లో తెలుగుదేశం ప్రభుత్వమే చేపట్టింది. ఆ తరువాత వైసిపి అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ముందుగా జరగాల్సిన భూసేకరణ మాత్రం రెండు ప్రభుత్వాల హయంలోనూ జరగలేదు. పేరూరు ఎత్తిపోతల పథకానికి మొత్తం 2729 ఎకరాల భూమి అవసరం. ఇందులో 2497 ఎకరాలకు అనుమతులు పొందారు. సేకరించింది మాత్రం 988 ఎకరాలు మాత్రమే. ఇంకా 1508 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. దీని తరువాత భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి నీళ్లందించే ఈ ప్రాజెక్టు 2018 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే చేపట్టారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చక భూసేకరణకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ కూడా నొక్కారు. కాని ఇప్పటికీ పూర్తి స్థాయి భూసేకరణ జరగలేదు. ఈ ప్రాజెక్టు కింద 1406 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 789 ఎకరాలు మాత్రమే సేకరించారు. ఇంకా 617 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇది కాకుండా పంపుహౌస్ నిర్మాణానికి 120 ఎకరాలు సేకరించాలి. ఆమిదాల బ్రాంచ్ కెనాల్‌కు 9.15 ఎకరాలు, గుంతకల్లు నియోజకవర్గంలో చెరువులకు నీరందించేందుకు 226 ఎకరాలు, ప్యాకేజీ 33 కింద 49 ఎకరాలు, ప్యాకేజీ 34 కింద 157 ఎకరాలు,. ప్యాకేజీ 36 కింద మొత్తం 835 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇవి పూర్తి చేయకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వం ప్రకటనలు చేస్తూనే ఉంది.

నిర్వాసితులకు న్యాయం చేసి పనులు చేపట్టాలి
వి.రాంభూపాల్ సిపిఎం జిల్లా కార్యదర్శి.

హంద్రీనీవా కింద అనేక హామీలను ప్రభుత్వాలు ఇస్తూనే ఉన్నాయి. అందుకు తగ్గట్టు చర్యలు మాత్రం ఉండటం లేదు. రెండు ప్రభుత్వాల హయంలోనూ పేరూరు ఎత్తిపోతలు, బిటిపికి నీరిస్తామని చెప్పారు. కాని దానికి ప్రాథమికంగా అవసరమైన భూసేకరణనే ఇప్పటికీ చేపట్టలేదు. తాజాగా లైనింగ్‌కు నిధులు కేటాయించారు. భూసేకరణ చేపట్టకుండా, నిర్వాసితులకు న్యాయం చేయకుండా పనులు తాత్సారం చేయడం సరైంది కాదు.

కష్టం వస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులే..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో ప్రజలకు కష్టం వస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ తెలిపారు. ఆదివానం నగరంలోని గణేనాయక్ భవన్‌లో అనంతపురం నగర సిపిఎం 8వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు తక్షణం కమ్యూనిస్టుల వైపు చూస్తారన్నారు. బూర్జువా పార్టీలు ఉద్యమాలు చేయలేవన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై పోరాడతారన్నారు. అందుకోసమే ప్రజలకు ఏ కష్టం వచ్చినా కమ్యునిస్టు నాయకుల వైపు చూస్తారని తెలిపారు. వైసిపి హయంలో విద్యుత్ ఛార్జీలు పెంచితే అప్పట్లోనే వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమాలు చేశాయని గుర్తు చేశారు. అప్పట్లో విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలపై భారం మోపిందని తెలిపారు. అందువల్ల ప్రజలకు నిరంతరం అండగా ఉండేది కమ్యూనిస్టులే అన్నారు. పాలకులు తీసుకునే నిర్ణయాలపై ప్రజల్లో ఆగ్రహం వస్తే ఎవరూ ఆపలేరన్నారు. ఇందుకు నిదర్శనంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు తీసుకువచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో ఏడాది పాటు ఉద్యమం చేశారని గుర్తు చేశారు. రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకతతో మోడీ దిగివచ్చి నల్ల చట్టాలను రద్దు చేశారని వివరించారు. అలాగే కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై దేశం యావత్తూ కదిలిన విషయాన్ని గుర్తు చేశారు. వీరందరికీ కమ్యూనిస్టులు అండగా నిలిచారన్నారు. వైసిపి హయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజులు సమ్మె చేశారని చెప్పారు. సూర్యరస్మి ద్వారా తయారయ్యే సోలార్ విద్యుత్‌కు కూడా అధిక ఛార్జీలు నిర్ణయించిన అదానీని దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కాపాడుతున్నారన్నారు. మోదీ అండదండలు ఉండటంతోనే రాష్ట్రానికి నష్టం జరిగితే ప్రజలపై భారం మోపారే తప్ప అదానీపై ఎలాంటి చర్యలు ఉండవన్నారు.

అదానీ వల్ల రాష్ట్రానికి రూ.లక్షకోట్ల నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులను కేంద్ర, రాష్ట్ర పాలకుల ద్వారా కేంద్రం బడా కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి కేంద్రానికి లొంగిపోయాయని ఆరోపించారు. దేశంలో ధన రాజకీయాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఎన్నికల బాండ్లను అనుమతించడం ద్వారా బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. కార్పొరేట్లను అడ్డం పెట్టుకుని హిందుత్వాన్ని ముందుకు తెచ్చి బిజెపి మతతత్వాన్ని రెచ్చగొడుతోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ మతపరమైన అంశాలను తెరపైకి తెస్తున్నాయన్నారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకుని బిజెపి దేశవ్యాప్తంగా తన ఎజెండా అమలు చేస్తోందన్నారు. ఈ మహాసభలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రమ్మ, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, నగర కమిటీ సభ్యులు, గోపాల్, వెంకట్‌నారాయణ, ప్రకాష్, వలి, మసూద్, వెంకటేష్, ఎన్టీఆర్ శ్రీను, ప్రసాద్, ఓబులేసు, ఇర్ఫాన్, బుల్లే రాజు, లక్ష్మీనరసమ్మ, బాబా, గఫూర్, ఆదినారాయణ, నూరుల్లా, ఎటిఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

11న రౌండ్‌టేబుల్ సమావేశం
సిఐటియు, రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అతివృష్టి, అనావృష్టి కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములు, ఇళ్లస్థలాల సమస్యలకు పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. అలాగే 2023 ఖరీఫ్ పంటల బీమా, 2024లో జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఖరీఫ్ పంట నష్టపరిహారం, బీమా ఇవ్వాలన్నారు. 2024 రబీ పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని, సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ, ఆలయం భూముల సాగు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని, పంట నష్ట పరిహారం, పంటల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కేరళ రాష్ట్రంలో సర్వం కోల్పోయిన వయనాడు వరద బాధితులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చర్చించుకే ఈనెల 11వతేదీన నగరంలోని జెవివి కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాగమణి

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి

ఆస్ట్రేలియా ప్రతినిధులతో అనంత ఎంపి సమావేశం

ప్రజాశక్తిలి-అనంతపురం రూరల్

ఎంతో అనుకూలమైన అనంతపురం జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆస్ట్రేలియా ప్రతినిధుల సమావేశంలో సహచర ఎంపీలతో కలిసి ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌తో జిల్లా పరిస్థితలను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకు అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా హార్టికల్చర్‌కు ఎంతో ప్రసిద్ధి చెందిన అనంతపురం జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు పెడితే ఎంతో లాభదాయకంగా ఉంటుందని వివరించారు. అంతేగాకుండా రెన్యువబుల్ ఎనర్జీ (సోలార్ ఎనర్జీ, విండ్ పవర్) సెక్టార్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల అనేకమంది ఉపాధి కలుగుతుందని, వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చని తెలిపారు.

ఆస్ట్రేలియా ప్రతినిధులతో అనంత ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

డ్రైయినేజీలు అస్తవ్యస్తం

ఎక్కడికక్కడ మురికినీరు నిల్వ-వ్యాప్తిచెందుతున్న దోమలు-ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని కృష్ణాపురం, లింగదహాల్ గ్రామాల్లో డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. నిల్వ నీటి వల్ల దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అపరిశుభ్రత కారణంగా దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల వద్ద దళితవాడ సమీపంలో పూర్తిగా వర్షం నీరు నిల్వ ఉంటోంది. మురికినీటితో పాఠశాల ఆవరణ సైతం అపరిశుభ్రంగా మారి, ఆనుకుని ఉన్న దళితవాడ, బీసీ కాలనీ వైపు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంచాయతీ అధికారులు చెత్త సేకరణ చేపట్టకపోవడంతో అపరిశుభ్రత పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. దీంతో రోజూకనీసం 20 మంది పిల్లల వరకూ అనారోగ్యం కారణంగా పాఠశాలకు హాజరు కావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిసరాలను శుభ్రం చేయడంతోపాటు మురికికాలువనలను శుభ్రం చేసి రోగాల నుంచి కాపాడాలని కృష్ణాపురం, లింగదహాల్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఉన్న వీధి

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేసి 10వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యానికి పెంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రోడ్డు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేసి 10వేల క్యూసెక్కుల నీటిని తీసుకొస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పుడు ఉన్న కాలువలో నీరు చివరి వరకూ వెళ్లడం ఇబ్బందికరంగా ఉందని, భావించి నీటి వేగాన్ని పెంచి కుప్పం నియోజకవర్గానికి నీటిని తీసుకుపోవాలని ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈఏడాది శ్రీశైలం జలాశయం నిండి దిగువకు వెళ్లినా జిల్లాకు అదనంగా నీరు తీసుకురాలేకపోయారన్నారు. ఇందుకు దీనికి ప్రధాన కారణం కాలువ ప్రవాహం సామర్థ్యం లేకపోవడమే అన్నారు.కాలువ సామర్థ్యం పెంచకుండా లైనింగ్ పనులు చేయడం వల్ల అదనంగా చేకూరే ప్రయోజనాలు ఏమీ లేవన్నారు. ప్రభుత్వం తక్షణమే లైనింగ్ పనులు ఆలోచనలు విరమించుకోవాలన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువలను కూడా వెంటనే పూర్తి చేసి జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్నారు. ఇకపోతే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి రూ.15వేల కోట్లను ప్రజలపై భారం వేశారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు తీవ్రంగా నష్టం జరుగుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

లైనింగ్‌తో ప్రయోజనం శూన్యం
కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న వై.మధుసూదన్‌రెడ్డి

జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి

సిఐటియు నాయకులు జగన్

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, మున్సిపల్ ఉద్యోగ ఇంజనీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పురపాలక సంస్థలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు జగన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి ఎపి మున్సిపల్ ఉద్యోగ, ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి పురపాలక సంస్థలో దాదాపు 25ఏళ్లుగా నమ్ముకుని పని చేస్తున్నారన్నారు. అయినా ఉద్యోగులకు పర్మినెంట్ చేయకపోగా వేతనాలు పెంచలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఉద్యోగుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటీలో గత ప్రభుత్వం 'విభజించు పాలించు' పద్దతిలో పని చేసిందన్నారు. కావున పారిశుధ్య కార్మికులకు రూ.21వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్షులు డి.జబేర్, కార్యదర్శి శ్రీరాములు, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, కోశాధికారి ప్రసాద్, కమిటీ సభ్యులు అర్జున్, రాము, రాజశేఖర్, ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

'రామాచార్యులు' విగ్రహానికి మెట్లు ఏర్పాటు

రామాచార్యుల విగ్రహానికి ఏర్పాటు చేసిన మెట్లను ప్రారంభిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

నగర నడిబొడ్డున జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు, సహకార గ్రంథాలయ ఉద్యమనేత పప్పూరు రామాచార్యులు విగ్రహానికి ఏర్పాటు చేసిన మెట్లను మేయర్ మహమ్మద్ వసీం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాదాపు 30ఏళ్ల క్రితం విగ్రహం ఏర్పాటు చేసినా మెట్లు మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ విషయాన్ని రామాచార్యుల స్మారక కమిటీ కన్వీనర్ హెచ్.నాగభూషణం కలెక్టర్, మేయర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారు మెట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రామాచార్యులు మనుమడు విజయ్‌కుమార్, మనవరాలు జమున, జ్వాలాపురం శ్రీకాంత్, ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కథ, నవలా రచయిత శాంతి నారాయణ, పప్పూరు రామాచార్యుల స్మారక కమిటీ నిర్వాహకులు హెచ్.నాగ లింగయ్య, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పగడాల మల్లికార్జున, విశ్రాంత నేషనల్ బీమా డివిజనల్ మేనేజర్ ఓబులపతి, ప్రజా గాయకులు దాసరి ఆదినారాయణ, కుళ్లాయప్ప, సాకె భాస్కర్, చంద్రశేఖర శాస్త్రి, డాక్టర్ జెన్నే ఆనంద్‌కుమార్, కమ్మన్న, శ్రీనివాసులు, టి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా పని చేయాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అభినందన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి సోషల్ మీడియా మరింత బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పంపిన అభినందన పత్రాలన్ని ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎస్సీ సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొండిపోగుల ఎర్రిస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి యాప్ ద్వారా టిడిపి ఆశయాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా తీవ్రంగా పని చేస్తోందన్నారు. మీకు పార్టీ అన్నిరకాలుగా అండగా ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నిర్బంధాలు, ఎన్ని కేసులు పెట్టినా, నెరవకుండా పని చేశారని కొనియాడారు. టిడిపి యాప్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సి.వెంకటేష్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాజీ మాసులు చంద్రమోహన్, శింగనమల గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ, డీలర్ లోలూరు నారాయణస్వామి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పామిడి అభయ బ్లడ్ డోనర్స్

రక్తదానం చేస్తున్న వడ్డే రాము

ప్రజాశక్తి-పామిడి

రక్తదానం ప్రాణదానంతో సమానమని అభయ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎద్దులపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న పర్వీన్ కాన్పు కోసం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు రక్తం ఎక్కించాలని సూచించగా బాధితురాలి బంధువులు పామిడి అభయ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవకులను సంప్రదించారు. వెంటనే స్థానిక నాగిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న జనసేన సీనియర్ నాయకులు వడ్డే రాముకు విషయం తెలుపగా ఆయన అనంతపురం వెళ్లి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా అభయ బ్లడ్ డోనర్స్ సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసిన జనసేన నాయకుడు రామును అభినందించారు.

సుబ్రమణ్ణేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్ : ఆత్మకూరు మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులను వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందించారు.

In The Court of the Principal District Judge: Ananthapuram

E.P.No.183/2023, O.S.No.208/2018

K.Dhananjaya ...Decree Holder

V/s

Smt. K.Padma & 4 others ...Judgment Debtor

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! పైన కనిన డిక్రీ హోల్డరు తనకు రావలసిన డిక్రి బాపత్తు వసూలు నిమిత్తం క్రింద కనపరచిన ఆస్తులను వేలంనకు తెచ్చియున్నారు. సదరు వేలం పై కనిన కోర్టు నందు తేది.27.12.2024 ఉదయం 10.30 గం॥ నుండి సాయంత్రము 5 గం॥లలోపు జరుగును. కావున ఆసక్తిగలవారు పై వేలంలో పాల్గొని క్రింద కనబరచిన ఆస్తిని కోర్టువారు నిర్ణయించిన షరత్తులకు లోబడి వేలం పాడుకోవలసినది.

వేలం తేది. 27.12.2024

Schedule: Property situated in R.D. of Anantapuramu and S.R.D. of Anantapuramu Rural within the limits of Brahmanapalli Village, Gotkur Panchayat, Kuderu Mandal.

Item No.1: Govt. Dry - 10/1 - Ac 1.88 paiki - Ac 1.88, Govt. Dry - 18 - Ac 7.16 paiki - Ac 7.16, Govt. Dry - 19/1- Ac 4.69 paiki- Ac 4.69, Govt. Dry - 19/2- Ac 3.09 paiki - Ac 3.09, Govt. Dry- 19/3- Ac 4.92 paiki - Ac 4.92, Govt. Dry - 46 - Ac 168.04 paiki - Ac 168.04, Govt. Dry - 55 - Ac 29.38 paiki - Ac 28.38, Govt. Dry - 61 - Ac 3.29 paiki - Ac 3.29, Total Extent: 221.45 paiki Ac.3.21 cents or 0.013 H.S., in which **Plot No.700.** **Bounded by: East:** Plot No.699; **West:** Road; **North:** Plot No.701; **South:** Road. **Admeasuring:** East-West: 40 feet or 12.19 mtrs., North-South: 35 feet or 10.67 mtrs.
D.Hr Value Rs. 10,00,000/-, Amins Value Rs: 10,20,000/-

Item No.2: Govt. Dry - 10/1 - AC 1.88 paiki - AC 1.88, Govt. Dry - 18 - AC 7.16 paiki - AC 7.16, Govt. Dry - 19/1 - AC 4.69 paiki - AC 4.69, Govt. Dry - 19/2 - AC 3.09 paiki - AC 3.09, Govt. Dry - 19/3 - AC 4.92 paiki - AC 4.92, Govt. Dry - 46 - AC 168.04 paiki - AC 168.04, Govt. Dry - 55 - AC 29.38 paiki - AC 28.38, Govt. Dry - 61 - AC 3.29 paiki - AC 3.29 Total Extent: 221.45 paiki Ac.4.13 cents or 0.168 H.S., in which **Plot No.746.** **Bounded by: East:** Road; **West:** Land of others; **North:** Road; **South:** Plot No.747. **Admeasuring:** East-West on Northern side: 62 feet or 18.90 mtrs., East-West on Southern side: 58 feet or 17.68 mtrs., North-South on Eastern side: 30 feet or 9.14 mtrs. North-South on Western side: 30 feet or 9.14 mtrs.
D.Hr Value Rs. 10,00,000/-, Amins Value Rs. 11,50,000/-

AVULA PURUSHOTHAM, Advocate for D.Hr, Tirupati
D.SARATHBABU, Advocate, for D.Hr, Ananthapuram

మాజీ సైనికుల సమావేశం

అనంతపురం : అనంతపురంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 1962-1965 మధ్యలో జరిగిన యుద్ధంలో పాల్గొన్న సీనియర్ మాజీ సైనికులకు సన్మానం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ సైనికుల సంఘ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, ఎండబ్ల్యుఒ బషీరాబాద్, ఈశ్వరయ్య, సిద్ధన్న, నరసింహులు, ఖాజామొద్దీన్, బాలస్వామి, వీరాచారి, డిఎం నాయుడు, మాహబూబ్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సామూహిక ప్రయోజనాలు

యోగివేమన విశ్వవిద్యాలయ ఆచార్య వినోదిని

అనంత కవిత్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సామూహిక ప్రయోజనాలను సాధించడమే సాహిత్య లక్ష్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.ఎం.వినోదిని తెలిపారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో 'స్పందన' అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో సాహితీవేత్త రాచపాళెం చంద్రశేఖరరెడ్డికు చం.స్పందన-2023 ఆత్మీయ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. అనంతరం రాచపాళెం రచించిన 'అనంత కవిత్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోదిని మాట్లాడుతూ సాహిత్యం ద్వారా సామూహిక ప్రయోజనాలను ఆశించిన విశిష్ట సాహితీమూర్తి రాచపాళెం అన్నారు. రాచపాళెం కవిత్వం మట్టి పరిమళంతో శ్రమ, భాగస్వామ్యంతో నిండి ఉందన్నారు. రచయిత శాంతినారాయణ మాట్లాడుతూ సంప్రదాయ భావజాలంలో ఉన్న తెలుగు శాఖ రాచపాళెం దృక్పథం, సారథ్యం వల్ల ఆధునికమయ్యాయని వివరించారు. హేతుబద్ధత, శాస్త్ర దృష్టి వంటి ఆధునిక భావాలు రాచపాళెం జీవితం, సాహిత్యంలో ప్రతిబింబిస్తాయన్నారు. వైజ్ఞానిక దృక్పథంతో విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశాయని సాహితీవేత్త ఎస్.షమీవుల్లా తెలిపారు. భిన్న సాహిత్యవాదాలను విమర్శతో సమన్వయం చేస్తూ మార్క్సిస్టు విమర్శ దృక్పథంతో రాచపాళెం పరిశోధించారని ప్రముఖ విమర్శకులు తూముచర్ల రాజారామ్ అన్నారు. 20ఏళ్లకుపైగా 'స్పందన' అనంత కవుల వేదిక అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. 50ఏళ్లకుపైగా రాచపాళెం చేసిన విస్తృతమైన సాహిత్య సేవలకు గుర్తింపుగా స్పందన-2023 ఆత్మీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని పురస్కార ప్రదాత వి.చంద్రశేఖరశాస్త్రి అన్నారు. అనంతరం రాచపాళెం చంద్రశేఖరరెడ్డి దంపతులను దుశ్శాలువ, నగదు బహుమతి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రసూన, చం.'స్పందన' ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి(చం.), సీనియర్ కవులు రాధేయ, ఏలూరు యంగన్న, జెట్టి జయరాం, తరిమెల అమరనాథరెడ్డి, అంకే శ్రీనివాస్, మధురశ్రీ, ఓబిళేసు, అశ్వర్థరెడ్డి, షరీఫ్, నాగేంద్ర, రియాజ్, దాసరి ఆదినారాయణ, పూజారి ఈరన్న, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

'పల్లె నిద్ర'లో పోలీసులు

ఆకులేడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ కౌలుట్లయ్య

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ఆయా పోలీసులు శనివారం రాత్రి పల్లెనిద్రలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని చావిడులు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రచ్చకట్టలను వేదికగా చేసుకుని నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడుతూ గ్రామాల్లో కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. ముఖ్యంగా గంజాయి, తదితర మత్తు పదార్థాలు జోలికెళ్లకుండా ఉండాలన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుపోతే జీవితాలు నాశనమడం ఖాయమన్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ చట్టాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, డయల్ - 100,112, తదితర అంశాలపై అవగాహన చేశారు. గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి పరిష్కారం చూపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

శింగనమల : గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలని సిఐ కౌలుట్లయ్య సూచించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని ఆకులేడు గ్రామంలో పోలీసులు పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు ఎలాంటి నేరాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలకు చాలా దూరంగా ఉండాలన్నారు. కేబుల్ వైర్ల దొంగతనాలు, ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనవసరంగా రాత్రి సమయాల్లో తిరగకూడదన్నారు. కాగా గ్రామంలోని ప్రధాన సెంటర్‌తోపాటు ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌చంద్ర, పోలీస్‌సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

అనంతపురం రూరల్ : అనంతపురం నియోజకవర్గానికి చెందిన టిడిపి యువ కార్యకర్త ముషీర్ మృతికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. ముషీర్ వారంరోజుల క్రితం కాలువపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముషీర్ మృతికి సంతాపం, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముషీర్ చిన్న వయస్సులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ఆదేశా లతో కార్పొరేటర్ హరిత, టిడిపి యువ నాయకులు అశోక్, శ్రీధర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహా సంతాపం తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

డిప్యూటీ డైరెక్టర్ జనరల్, అడిషనల్ ఆర్‌జిఐకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతో కాలంగా వెనుకబడి నలిగిపోతున్న వాల్మీకి, బోయ సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు ఆదివారం న్యూఢిల్లీలో తెలంగాణా ఎంపి ఈటెల రాజేంద్రతో కలిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బిశ్వజిత్, అడిషనల్ ఆర్‌జిఐ సునీల్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రయత్నాలు చేసినప్పటికీ, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కేంద్ర జాబితాలో చేర్చడంలో జాప్యం జరుగుతోందన్నారు. వాల్మీకి, బోయ సామాజికవర్గం ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్టీ కేటగిరీలో చేర్చాలని సిఫార్సు చేస్తూ డిసెంబర్ 2, 2017న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించిందని వివరించారు. ఈ తీర్మానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక ఫలితాల ఆధారంగా రూపొందించిందన్నారు. దీనికితోడు సత్యపాల్ కమిటీ నిర్వహించిన ఎథ్నోగ్రాఫిక్ అధ్యయనంలో వాల్మీకి, బోయ వర్గాల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా నిర్ధారించాయని గుర్తు చేశారు. అలాగే లోకూర్ కమిటీ గుర్తించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌జిఐకి అవసరమైన సహాయాన్ని అందించేందుకు అట్టడుగు వర్గాలకు సరైన గుర్తింపు, ఉద్ధరణను నిర్ధారించడానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కావున త్వరతిగతిన కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేందుకు సహకరించాలని కోరారు.

మతపరమైన లెక్కల సేకరణ ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

అంగన్వాడీ కేంద్రాల ద్వారా మతపరమైన లెక్కల సేకరణను వెంటనే ఆపాలని సిపిఎం పార్టీ కార్యదర్శి ఎన్.లోకేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీల పిల్లల లెక్కలను 2014 నుంచి 2025 వరకూ పుట్టినవారి వివరాలను 24 గంటల్లోగా పంపాలని అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం బాధాకరమన్నారు. ఎవరికీ చెప్పకుండా గుట్టుగా వివరాలను పంపమని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందనా్రు. ఇలాంటి వివరాలను బహిరంగంగా ప్రకటించి, పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కులగణన చేయాలని సిపిఎం, సహా అనేక ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుంటే పట్టించుకోకుండా మరోవైపు గుట్ట చప్పుడు కాకుండా రాజ్యాంగ విరుద్ధంగా మతపరమైన వివరాలు సేకరించడం వెనుక అజెండా ఏంటో చెప్పాలన్నారు. తక్షణమే ఈ లెక్కల సేకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

రాయదుర్గం : ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ పిల్లల లెక్కలను సేకరించి తమకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2014-2025 వరకూ పుట్టిన ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ పిల్లల వివరాలను సేకరించి 24 గంటల్లో పంపాలని అంగన్వాడీలకు ఆదేశాలు జారీ చేయడం మంచిది కాదన్నారు. ఐసిడిఎస్ శాఖ జారీ చేసిన ఆదేశాల వెనుక ఉద్దేశం ఏంటో, ఏ లక్ష్యంతో సేకరిస్తున్నారో చెప్పకుండా గుట్టుగా వివరాలను పంపమని చెప్పడం అనుమానాలకు దారితీస్తోందన్నారు. ఇలాంటి వివరాలను బహిరంగంగా ప్రకటించి, పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మండలంలోని హులికల్లు గ్రామంలో కొల్హాపురమ్మ ఆలయ నిర్మాణానికి కళ్యాణదుర్గానికి చెందిన సి.శ్రీనివాసులు రూ.10వేలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి పెద్దఎత్తున విరాళాలు ఇవ్వడం సంతోషమని కమిటీ సభ్యులు తెలిపారు. మరికొంతమంది విరాళాలు ఇచ్చి ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని కమిటీ సభ్యులు గంగమ్మ, మాజీ కౌన్సిలర్ కొల్లాపూరప్ప కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న సి.శ్రీనివాసులు

ఎమ్మెల్యే చొరవతో సర్టిఫికెట్ జారీ


రామాంజనేయులుకు సర్టిఫికెట్ అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వికలాంగుల సర్టిఫికెట్ కోసం రెండేళ్లుగా పోరాడుతున్న బాధితుడికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో ఎట్టకేటలకూ అధికారులు జారీ చేశారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన అక్కులప్పగారి కురుబ రామాంజినేయులు 2020 జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడికాలు పూర్తిగా పని రాకుండా పోయింది. దీంతో నడవలేనిస్థితిలో ఉన్న రామాంజినేయులు ఎన్నోసార్లు సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సచివాలయాలు చుట్టూ తిరిగినా అధికారులు ఎవరూ స్పందించలేదు. ఈనేపథ్యంలో ప్రజావేదిక వద్ద రామాంజనేయులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సదరం సర్టిఫికెట్ జారి అయ్యేలా చొరవ చూశారు. జారీ అయిన సర్టిఫికెట్‌ను గ్రామ టిడిపి నాయకులు ఆదివారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కురుబ మల్లికార్జున, మారెప్ప, రంగారెడ్డి, యు.రామాంజినేయులు, గ్రామ అధ్యక్షులు చాకలి వెంకటేశులు, ముదేప్పగారి ఉమేష్, పెద్దరామప్పగారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆర్‌డిఒ కేశవనాయుడు

వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని పాత కల్లూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఆర్‌డిఒ కేశవనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికి కనీస మద్దతు ధర రూ.2300 నిర్ణయించినట్లు తెలిపారు. అయితే తేమ శాతం 17శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల అకౌంట్లోకి డబ్బులు చెల్లిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, ఎఒ సోమసుందర్, మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

13,14న జాబ్‌మేళా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గ ప్రాంత యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈనెల 13, 14న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో స్థానిక దోడగొట్ట రోడ్డులో ఉన్న జ్ఞాన భారతి స్కూల్‌లో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేవారు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్.. 91435 35535ను సంప్రదించాలని కోరారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన


గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని శాంతినగర్ 1, 2, 3వ సచివాలయాల పరిధిలో ఆయా ఆరోగ్య కార్యదర్శుల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ మూడు నెలలలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తద్వారా గర్భిణులకు కలిగే దుష్పరిణామాలను ప్రాథమిక దశలోనే అడ్డుకోవచ్చన్నారు. కాగా ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు తీసుకోవడం వల్ల రక్తహీనత కలగకుండా కాపాడుతుందని వివరించారు. అలాగే తరచూ శరీర బరువు, రక్తపుపోటు, రక్తహీనత పరిస్థితి వంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ పైన టెటనెస్ టాక్సాయిడ్ ఇంజక్షన్ తీసుకోవాలన్నారు. తగిన శరీర వ్యాయామం, రోజులో 2-3 గంటల విశ్రాంతి తీసుకోవాలన్నారు. వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులూ తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు విజయలక్ష్మి, పవిత్ర, తులసి, ప్రమీల, సరళాబాయి, ఆశా కార్యకర్తలు మారెక్క, పవిత్ర, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల స్థల పరిశీలన

ఇస్తేమా నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న ముస్లిం మతపెద్దలు

ప్రజాశక్తి-నార్పల

ఈనెల 18, 19వతేదీలో మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా ఇస్తేమా నిర్వహణకు ముస్లిం మతపెద్దలు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా మతపెద్ద అనంతపురానికి చెందిన అమీర్షా ఆధ్వర్యంలో నార్పల క్రాసింగ్‌లో పలు స్థలాలను పరిశీలించారు. తర్వాత ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఇస్తేమా ఏర్పాటుకు నిర్ధారించినట్లు మతపెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం మతపెద్దలు మౌలానాలు, ఇమాములు, ముతవల్లి, మాజీ ముతవల్లిలు మండల ముస్లిం సోదరులు పాల్గొన్నారు

హాకీ విజేత కళ్యాణదుర్గం జట్టు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జరగుతున్న అండర్-8, అండర్-10 మిక్స్‌డ్ జెండర్ హాకీ ఛాంపియన్‌షిప్ విజేతగా కళ్యాణదుర్గం జట్టు నిలిచింది. ఫైనల్ పోటీల్లో కళ్యాణదుర్గం, దురదకుంట జట్లు పోటీ పడగా విజేతగా కళ్యాణదుర్గం నిలవగా ద్వితీయ బహుమతి దురదకుంట జట్టు నిలిచింది. ఆయా జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాకీ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అనిల్‌కుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, జాయింట్ సెక్రటరీ అక్రమ బాషా, ఆర్డీటీ హాకీ కోఆర్డినేటర్ వంశీ, ఆర్డీటీ రీజినల్ హాకీ కోచ్‌లు చౌడేశ్వర్, శంకర్, క్రీడాకారుల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ట్రోఫీ అందుకుంటున్న కళ్యాణదుర్గం జట్టు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి : పట్టణంలోని చెంబులబావి వీధిలో నివాసం ఉండే వ్యక్తి ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెంబులబావి వీధికి చెందిన గ్యాస్ గోపాల్ కడుపునొప్పి తాళలేక ఈనెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డ్రైవర్ రాఘవ అదృశ్యం

డ్రైవర్ రాఘవ

నార్పల : మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ రాఘవ శనివారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో రాఘవ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని నడిబొడ్డున ఉన్న కూతలేరు నూతన వంతెన అభివృద్ధి పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగించారు. దీంతో వెనకవైపు ఉన్న రాఘవ గృహం ముందుకు వచ్చింది. ఆ ప్రదేశంలో రాఘవ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నాడు. అప్పటి నుంచి వివాదం మొదలైంది. ప్రస్తుతం నిర్మాణం పూర్తి కావడంతో పలు విధాలుగా రాఘవపై ఒత్తిడి అధికం కావడంతోనే రాఘవ ఇల్లు వదిలి వెళ్లిపోయాడని ప్రచారం జరుగుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ సాగర్ నార్పల క్రాస్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించారు.